# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## ద్విచక్ర వాహనం - కారు ఢీ
### యువకుడికి తీవ్రగాయాలు



వరదయ్యపాలెం, నవంబర్ 8, ప్రభాతవార్త
వరదయ్యపాలెంలో కడూరు బ్రిడ్జి మలుపు వద్ద ద్విచక్ర వాహనం - కారు ఎదురెదురుగా ప్రయాణిస్తూ ఢీ కొనడంతో రోడ్డు ప్రమాదం గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు తమిళనాడు చెన్నైకి చెందిన ఓ యువకుడు ద్విచక్రవాహనంపై ఉబ్బలమడుగు వాటర్ ఫాల్స్ వచ్చి తిరిగి వెలుతుండగా కడూరు బ్రిడ్జి వద్ద ఓ కారును ఢీ కొనింది. ఈ ప్రమాదంలో యువకుడి రెండు కాళ్ళు పూర్తిగా తీవ్ర గాయాలు అయినట్లు తెలుస్తుంది. సమాచారం అందుకున్న పోలీసులు, 108 సిబ్బంది యువకుడిని హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## మహిళపై అడవి జంతువు దాడి
### భయాందోళనకు గురవుతున్న ప్రజలు



వెదురుకుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త :
అడవి జంతువు దాడిలో మహిళ గాయపడిన సంఘటన మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి ... మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ పరిధిలోని ఎర్రగుంట సమీపంలో అటవీ ప్రాంతంలో అడవి జంతువు లక్ష్మిపై దాడి చేసి గాయపర్చినట్లు చెప్పారు. స్టోన్ క్రషర్ సమీపంలో దాడి జరిడిందన్నారు. గతంలో కూడా ఆ ప్రాంతంలో అడవి జంతువు మహిళపై దాడి చేయడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గాయపడిన మహిళను స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్ళి చికిత్స చేయించారు. అటవీశాఖాధికారులు ఆ ప్రాంతంలో పర్యటించి జంతువుల సంచారం తెలుసుకుని ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## కల్యాణ వెంకన్న పవిత్రోత్సవాలకు అంకురార్పణ
### తిరుచ్చిపై విహరించిన విష్వక్సేన స్వామి



చంద్రగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త:
శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారి పవిత్రోత్సవాలకు ఆలయ అర్చకులు ఆగమోక్తంగా అంకురార్పణ గావించారు. ఇందులో భాగంగా ఆలయ అర్చకులు స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల అర్చనాధి నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ ఆగమ సలహాదారులు మోహన రంగాచార్యుల పర్యవేక్షణలో అర్చకులు నారాయణాచార్యులు ఆచార్య రుత్వీక వరణం నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో పవిత్రోత్సవాలకు ఆగమోక్తంగా అంకురార్పణ గావించారు. అనంతరం విష్వక్సేన స్వామి వారు విశేష అలంకారప్రాయుడై తిరుచ్చి వాహనంలో ఆలయ తిరుమాడ వీధులలో విహరించారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్స్ నర్రా మునిచెంగల్రాయులు, తేనెపల్లి వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనుంబట్టు ధనశేఖర్, అర్చకులు కె.ఎన్.భాస్కర్, అధ్యాపక రవిచంద్రన్, ఘనాపాటి తిరువెంగడం, పరిచారిక ఉదయ్ తేజ, జమేధర్ కేశవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## శిధిలావస్థలోని పార్వేటమండపాన్ని
# అద్భుతంగా నిర్మించాం
### పాతమండపంలో శిల్పాలు యధాతధంగా వినియోగం
### కొద్దిరోజుల్లో 2వేల ఆలయాలు పూర్తి -టిటిడి ఈఓ ధర్మారెడ్డి



తిరుమల, నవంబర్ 8ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలకొండపై పురాతన పార్వేటమండపం శిధిలావస్థకు చేరుకోవడంతోనే ,పాతమండపంలోని శిల్పాలను అలాగే వినియోగించి నిర్మించామని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి స్పష్టం చేశారు. పాతమండపాలు శిధిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారితే,భక్తులకు ఇబ్బందేనని గుర్తించి పున:నిర్మించాలని భావిస్తే కొందరు అర్థరహిత ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. స్వార్థం కోసం మండపాలను నిర్మించారనడం అర్థంలేదన్నారు. ఇటీవల తిరుపతి అలిపిరి వద్ద విశ్రాంతిమండపం రాతికట్టడం కూలిపోయే ప్రమాద స్థితికి చేరుకోవడం , రాతిబండలు పడిపోయే పరిస్థితిలో ఉన్నట్లు ఇంజనీరింగ్ నిపుణులు పేర్కొన్నారన్నారు.దీంతో శిధిలావస్థకు చేరిన పాతమండపాన్ని తొలగించి పున:నిర్మించేందుకు చూస్తుంటే కొందరు టిటిడిపై ఆరోపణలు ఎందుకుచేస్తున్నారనే ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఉదయం తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ అలిపిరివద్ద విశ్రాంతిమండపం పున:నిర్మాణం చేపట్టే విషయంలో కొందరు పురావస్తుశాఖ అనుమతి తీసుకుని నిర్మించాలని వ్యక్తీకరించారని చెప్పారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాకు లేఖ రాశామని, పురావస్తుశాఖ అనుమతి అవసరమా లేదా తెలియజేయాలని కోరామన్నారు. అనుమతి అవసరమైతే అనుమతులు ఇవ్వాలని, లేకపోతే టిటిడినే పున:నిర్మిస్తుందని లేఖలో పేర్కొన్నామని ఇఓ తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటూ మండపం నిర్మిస్తామన్నారు. 2019వ సంవత్సరం నుండి శ్రీవాణి ట్రస్ట్‌ద్వారా 1,600 ఆలయాలు నిర్మించామని, త్వరలో 2వేల దేవాలయాలు పూర్తిచేస్తామన్నారు. అనేక ఆలయాలను పున:నిర్మాణం చేశామని, అలాంటి ఆలయాల్లోఎక్కడా ఇబ్బంది రాలేదని తెలిపారు. టిటిడికి సంబంధించి రెండు ఆలయాలు శ్రీనివాసమంగాపురం, ఒంటిమిట్ట ఆలయాలు మాత్రమే పురావస్తుశాఖ పరిధిలో ఉన్నాయన్నారు. పురావస్తుశాఖ విభాగం శిధిలావస్థకు చేరిన మండపాలను పున:నిర్మిస్తామంటే ఎటువంటి ఇబ్బందిలేదన్నారు. నవంబర్ 1వతేదీ నుండి కాలిబాట సమీప అటవీప్రాంతంలో చిరుత, ఎలుగుబంటి సంచారం లేదని, నిరంతరాయంగా ట్రాఫ్ సిసికెమెరాలద్వారా పర్యవేక్షిస్తున్నామన్నారు. భక్తుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఈఓ ధర్మారెడ్డి తెలిపారు.

## కాకినాడలో కమనీయంగా వరసిద్ధుని కళ్యాణం





గణపతిహోమంలో భాగంగా పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు. కళ్యాణోత్సవం సందర్భంగా మాంగల్యం చూపుతున్న అర్చకులు.

కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం, ధర్మప్రచార పరిషత్ మరియు సేవ్ టెంపుల్ ఇర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో బుధవారం కాకినాడలో గణపతిహోమం, కళ్యాణోత్సవంలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాలను నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం కాకినాడలోని శ్రీబాల త్రిపురసుందరీ దేవి ఆలయ కళ్యాణమండపంలో నిర్వహించారు. కాణిపాకం ఆలయానికి చెందిన అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా గణపతిహోమం, కళ్యాణోత్సవం కార్యక్రమాలను నిర్వహించారు. ఈమేరకు స్వామి అమ్మవారి ఉత్సవమూర్తులను కళ్యాణమండపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చి వుంచి అలంకరించి వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ గణపతిహోమం, అనంతరం స్వామివారి కళ్యాణోత్సవంను వైభవోపేతంగా నిర్వహించి భక్తులకు తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సేవ్ టెంపుల్స్ భారత్ ఆర్గనైజేషన్ సభ్యులు గజల్ శ్రీనివాస్, కాణిపాకం దేవస్థానం ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, శ్రీబాల త్రిపుర సుందరీ దేవి ఆలయ ఛైర్మన్ రత్నాజీ, ఈఓ విజయభాస్కర్‌రెడ్డి, కాణిపాకం దేవస్థానం అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు
# ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం..!

చంద్రగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త:

### కేంద్ర ప్రభుత్వ వైఖరిపై విద్యార్థుల "మానవహారం"
### ఏఐటియుసి ఆధ్వర్యంలో నిరసన



విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు నినాద ఉద్యమ స్ఫూర్తితో విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకుందామని విద్యార్థులు నినదించారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కార్ విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని కార్పొరేట్ సంస్థలకు విక్రయించే చర్యలను ఖండిస్తూ ఏఐటియుసి ఆధ్వర్యంలో విద్యార్థులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల విద్యార్థులు తమ కళాశాలల నుండి ర్యాలీగా టవర్ క్లాక్ వద్దకు చేరుకుని మానవ హారం నిర్మించి కేంద్రప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఏఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ 32 మంది బలిదానాలతో ఏర్పాటు చేయబడిన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరించాలనే ఆలోచన మోడీ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విభజన హామీలలో ప్రధానమైన కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం కోసం విద్యా సంస్థల బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకునేందుకై 1000 రోజులుగా ప్రజా సంఘాలు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా బంద్ చేయడం జరిగిందన్నారు. వెనుకబడిన రాయలసీమలో నాలుగు పర్యాయాలు శంకుస్థాపనలు చేసినప్పటికీ ఉక్కు ఫ్యాక్టరీ ఆచరణలో నిర్మాణానికి నోచుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన హామీలను అమలు చేయడంలో మోడీ విఫలమయ్యారని దుయ్యబట్టారు. ఉక్కు పరిశ్రమలను కాపాడుకునేందుకు విద్యార్థులంతా పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీరాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నీన్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ బాలికల విభాగం కన్వీనర్ స్మిత, నాయకులు అశోక్, కిషోర్, సాయి, జ్యోతిష్యం, ఆనంద్, రాజేష్, రాకేష్, తదితరులు పాల్గొన్నారు.

## 13న సామూహిక కేదార గౌరీ వ్రతం



శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 13న సామూహిక కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించుటకు దేవస్థానం తీర్మానించింది. ఈ మేరకు బుధవారం కార్తీక మాసంలో అమలు చేయాల్సిన అంశాలకు సంబంధించి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులు, అర్చకులతో సమీక్షించారు. గతంలో శ్రీకాళహస్తి, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన మహిళలు ఇళ్ళలోనే నోములు నోచుకునే వారు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా ఆలయంలో సామూహిక కేదార గౌరీ వ్రతంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపధ్యంలో ఈ సారి దీపావళి సందర్భంగా సోమవారం కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించుటకు తీర్మానించారు. ఈ ఏర్పాట్లను ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సమీక్షించారు. అర్చకులు ఖరారు చేసే సమయం మేరకు సామూహిక కేదార గౌరీ వ్రతాన్ని నిర్వహించుటకు సంబంధించి సామాన్యభక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వ్రతం చేసుకునే వారికి వాయనాలు అందించే కార్యక్రమాలను అందరికి అందేటట్లు చర్యలు తీసుకోవాలలన్నారు. అలాగే ఈ నెల 17న నాగుల చవితి సందర్భంగా చేపట్టే కార్యక్రమాలను ఏర్పాట్లును ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సమీక్షించారు. ఈ సమీక్షల్లో ఇఓ కెవి సాగర్‌బాబు, ఇఇ నూకారత్నం, డిఇఇ శ్రీనివాసులు రెడ్డి, జెఇఓ వెంకటసుబ్బయ్య, స్థలపతి డాక్టర్ స్వామినాధన్ గురుకుల్, ప్రధానార్చకులు సంబంధం గురుకుల్, కరుణాకర్ గురుకుల్ ఉప ప్రధానార్చకులు రామనాధన్ గురుకుల్, వరదా గురుకుల్, పౌరోహితులు అర్ధగిరి స్వామి, అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున్ ప్రసాద్, ఎఇఓ ఎకే ధనపాల్, సూపరింటెండెంట్ శ్రీహరి, నాగభూషణం, ఎఇఇ కిషోర్ కుమార్, పిఆర్ఓ నాగభూషణం నాయక్, టెంపుల్ ఇన్సెపెక్టర్ సుదర్శనం నాయుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

## గాయాలతో పట్టుబడిన మగ ఏనుగు మృతి

తిరుపతి, నవంబర్ 8ప్రభాతవార్త:
చిత్తూరుజిల్లాలో ముగ్గురు వ్యక్తులు, కొన్ని పశువులపై దాడిచేసి ప్రాణాలు తీసిన మగ ఏనుగు(16)తిరుపతి ఎస్వీజూలో సంరక్షణలో ఉంటూ గాయాలతో మృతి చెందింది. అడవిలో యధేచ్ఛగా సంచరించే ఈ ఏనుగు అక్కడ బీభత్సం సృష్టించి గాయాలకు గురైంది. ఈ మగ ఏనుగును తిరుపతి ఎస్వీజూలో నెలన్నరరోజులుగా ఉంచి చికిత్స అందిస్తున్నా ఫలితం లేక మృతి చెందింది. సెప్టిసిమియా వ్యాధితో మృతిచెందినట్లు పశు వైద్యులు ప్రాధమికంగా నిర్ధారించారు.

# నగరి నియోజకవర్గ అభివృద్ధిపై చర్చకు సిద్ధం
### ముందు చూపుతోనే వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు - బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి



చిత్తూరురూరల్, నవంబరు 8 ప్రభాతవార్త:
దొంగ ఓట్లు, కరెన్సీలతో గెలవడానికి వైకాపా ప్రణాళికలు సిద్ధం చేసుకొంటున్నాయనీ, నగరి నియోజకవర్గ అభివృద్ధిపై భాజపా చర్చకు సిద్ధంగా వుందని, నిజాయితీని నిరూపించుకోవడానికి మంత్రి రోజాకు ధైర్యముందా అని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భాను ప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ప్రశ్నలు సంధిస్తుంటే వెన్నులో వొణుకు పుట్టి మంత్రి రోజా, పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారన్నారు. ధైర్యముంటే తమ నిజాయితీని నిరూపించుకోవాలన్నారు. గురువారం మీ నియోజకవర్గమైన నగరికి భాజపా నాయకులందరూ కలసి వస్తున్నామని, నిజాయితీని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. అలాగే వైకాపా ముందు చూపుతోనే వాలంటీర్ల వ్యవస్థ ఏర్పాటు చేసిందని, ప్రతి బూత్‌లో దొంగ ఓట్లు వేయడానికి వాలంటీర్ల నుంచి సమాచారం తెలుసుకొంటున్నారన్నారు. ఈ దొంగ ఓట్ల విషయమై కేంద్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. జిల్లా అధ్యక్షుడు జగదీశ్వరనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిపై మంత్రి రోజా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అధికార దాహం కోసం మా అధినేతపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలనీ, లేనిచో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎన్‌పి వెంకటేశ్వర చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శులు అట్లూరిశ్రీనివాస్, వెంకటముని, తులసీనాథ్, జిల్లా ఉపాధ్యక్షులు చంద్రమోహన్, జిల్లా కార్యదర్శి కొత్తపల్లిబాబు, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబు, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు దామోదరరెడ్డి, నాయకులు సురేష్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పెద్దిరెడ్డికి ఘనస్వాగతం ..పలువురు వైకాపాలో చేరిక

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త



రాష్ట్ర అటవీ,గనులు,విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి కుప్పంలో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఘనస్వాగతం పలికారు. మంత్రి తమిళనాడులో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కుప్పం రాగా మంత్రికి బాణసంచా కాల్పుల మధ్య ఘనంగా స్వాగతం పలికారు. కుప్పం మున్సిపాలిటీలో 66కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. అన్ని వార్డుల్లో పనులు త్వరగా పూర్తి చేయాలని మంత్రి సూచించినట్లు ఛైర్మన్ తెలిపారు. కార్యక్రమాల్లో పలువురు కౌన్సిలర్లు, స్థానిక నేతలు పాల్గొన్నారు. కాగా మంత్రి పర్యటనలో భాగంగా రామకుప్పం మండల ం గెర్నిపల్లికి చెందిన తెదేపా నేత సుధాకర్‌రెడ్డి, సగినేకుప్పం జగదీష్, మొద్దులవంక కేశవులు మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలో వైకాపా తీర్థ ం పుచ్చుకున్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, మాజీ ఎఎంసి ఛైర్మన్ లలిత మురుగేష్, నేతలు కేశవరెడ్డి, చెంగారెడ్డి, గుడుపల్లె జడ్పీటిసి క ృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ..దళితుల భూములు పరిరక్షించాలి

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త



మండలంలో పలు చోట్ల ఉన్న దళితుల, ప్రభుత్వ భూములు పరిరక్షించాలని దళిత, గిరిజన నేతలు కోరారు. బుధవారం తహశీల్దార్ పార్వతి అధ్యక్షతన మండల ఎస్సీ,ఎస్టీ అ ట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈసందర్భంగా దళిత నేతలు మాట్లాడుతూ డికెపల్లిలో ఒకరికి చెందిన ఇంటి పట్టాను వాటర్‌మెన్ భార్య పేరిట పట్టాలు ఇచ్చారని ఈ విషయంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని మల్లానూరులో ప్రభుత్వ భూముల ఆక్రమణలు గుర్తించి వాటిని పరిరక్షించాలని ఎంఆర్‌పిఎస్ నేత రాజ్‌కుమార్ కోరారు. పరమసము ద్రం మార్గంలో ఓ అధికార పార్టీ నేత ప్రభుత్వ భూమిని ఆ క్రమించాడని ఈ విషయంగా విచారించి భూమి స్వాధీనం చేసుకోవాలని దళిత నేతలు పేర్కొన్నారు. మండల పరిధిలో నాటుసారా తయారీ అధికంగా ఉందని అరికట్టాలని పలువురు సభ్యులు కోరారు. అనంతరం వివిధ అంశాలపై చర్చించారు. సమావేశంలో ఎంపిడిఓ ఖాదర్‌బాషా, నేతలు రవినాయక్, మురుగేష్, ప్రకాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకై పదివేల ఆర్థికసాయం

కుప్పంరూరల్, నవంబర్ 8 ప్రభాతవార్త



మున్సిపల్ పరిధి తంజం కొటాలుకు చెందిన వైకాపా కార్యకర్త హనుమంతు తల్లి మృతిచెందారు. ఈమె మృతి పట్ల ఎమ్మెల్సీ భరత్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్‌లు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియల నిమిత్తం మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ అందించిన పదివేల ఆర్థికసాయంను కౌన్సిలర్లు జగన్, నాగరాజు, ఆంజనేయగుడి ఛైర్మన్ కుమరేష్‌లు బాధిత కుటుంబానికి అందించారు.

## భరత్‌కు అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేస్తాం

– ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని

శాంతిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త



కుప్పం ఎమ్మెల్యేగా ఈసారి ఎమ్మెల్సీ భరత్‌కు అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గా పద్మిని ఠాకూర్ కోరారు. బుధవారం మండలంలోని శివరాంపురం పంచాయతీ కోటగడ్డ, కొత్త ఇండ్లు, ఒడ్డువంక, నంజం పేట, గట్టూరు గ్రామాల్లో జగనన్నతో జనం,భరతన్నతో మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి మహిళలకు పసుపు, కుంకుమ,సారె పంపిణీ చేశారు. కుప్పం అభివృద్ధికి తాము కట్టుబడి ఉన్నామని, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, గౌస్, స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

కాణిపాకం, నవంబర్ 8 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానం ఆస్థాన మండపంలో తిరుపతి శ్రీవేంకటేశ్వర ఆయుర్వేద వైద్యకళాశాల వారి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్యశిబిరం ద్వారా రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కళాశాల ప్రిన్సిపాల్, సూపరెండెంట్ డాక్టర్ రేణు దీక్షిత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పలు రకాల రోగాలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. అలాగే స్థానిక రైతులకు ఔషద మొక్కల సాగు– అవకాశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పక్షవాతము, మొలలకు సంబందించి ప్రత్యేక చికిత్సలు పంచకర్మ, క్షారసుత్ర, చిన్న పిల్లల వ్యాధులను నయం చేయడానికి చేస్తున్న ప్రత్యేక చికిత్సలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ రేణు దీక్షిత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్ కోదండపాణి, ఆస్పత్రి నోడల్ ఆఫీసర్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ రమేష్, డాక్టర్ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మండల వడ్డెరసంఘ అధ్యక్షుడుగా మిద్దింటి గోపీనాథ్

చౌడేపల్లి, నవంబర్ 8 ప్రభాతవార్త



మండల వడ్డెరసంఘ అధ్యక్షుడుగా చారాల పంచాయతీ బీర్జేపల్లికి చెందిన మిద్దింటి గోపీనాథ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు పెనుమూరు మండల కార్యాలయ ప్రారంభోత్స వంలో భాగంగా పులివెందుల మున్సిఫల్ ఛేర్మన్, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ మనోహర్‌లు తనను మండల వడ్డెరసంఘ అధ్యక్షుడుగా నియమించినట్లు గోపీనాథ్ తెలిపారు. తనపై నమ్మకంతో పదవిచ్చిన వరప్రసాద్, మనోహర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. అదే స్థాయిలో పనిచేసి వడ్డెరల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతనంగా నియమితులైన మిద్దింటి గోపీనాథ్ అన్నారు.

## శ్రీకృష్ణ దేవాలయంకు గ్రానైట్ వితరణ

– నియోజకవర్గం టీడీపీ యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్

వెదురుకుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త :



మండలంలోని పాతగుంట గ్రామంలో గల శ్రీకృష్ణ ఆయలంకు గంగాధర నెల్లూరు నియోజకవర్గం టీడీపీ తెలుగు యువత అధ్యక్షులు గురసాల కిషన్ చంద్ బుధవారం గ్రానైట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పలువురు. ఆలయ ధర్మకర్త కోరిక మేరకు ఆలయంకు కావలసిన గ్రానైట్ అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి వెంకటరమణా రెడ్డి, టిఎన్‌టియూసీ నియోజకవర్గం అధ్యక్షులు గాలి బాబు నాయుడు, నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు చాణిక్యప్రతాప్, సీనియర్ లీడర్ రాజశేఖర్ వర్మ, నాయకులు మునికృష్ణా రెడ్డి, ఆనంద రెడ్డి,మురళి తదితరులు పాల్గొన్నారు.

## వాయుకాలుష్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి

– పిఇఎస్ వైద్యకళాశాల డీన్ డా॥ కృష్ణారావు

కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త




వాయుకాలుష్యం పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,రోగుల వ్యాధి నిర్ధారణలో పాథాలజీ విభాగం ఎంతో ముఖ్యపాత్ర పోషిస్తుందని పిఇఎస్ వైద్యకళాశాల డీన్, ప్రిన్సిపాల్ డా॥ హెచ్‌ఆర్ కృష్ణారావు పేర్కొన్నారు. బుధవారం పిఇఎస్‌లో అంతర్జాతీయ పాథాలజీ దినోత్సవంను ఘన ంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కళాశాల ప్రాంగణంను కాలుష్య రహిత ప్రాంగణంగా ఉంచేందుకు తమవంతు సహకారం అందించాలన్నారు. వాయుకాలుష్యంతో దేశరాజధాని ఢిల్లీలో ప్రజలు ఎంతో అవస్థలు పడుతున్నారనే విషయం గుర్తు చేశారు. మెడికల్ సూపరింటిండెంట్ డా॥ సుబ్రమణ్య మాట్లాడుతూ వాయుకాలుష్యంతో ఊపిరితిత్తుల వ్యాధులు వస్తాయన్నారు. 30–40ఏళ్లలోపు బాడీ బిల్డర్లు మరణానికి ఇది కూడా ఓ కారణమని పరిశోధనలు చెబుతున్నాయన్నారు. ఈసందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా॥ ర్యాలీ సుబ్బారావు, హెచ్ఒడి డా॥ రామస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఏపీకి జగనే ఎందుకు కావాలి విజయవంతం చేయాలి



సదుం, నవంబరు 8 ప్రభాతవార్త:

మండల పరిదిలో ఈనెల 9వ తేదీ నుంచి జరుగనున్న ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని అందరు పాల్గొని విజయవంతం చేయాలని సదుం మండల జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 9న సదుం సచివాలయం–1, 10న సదుం సచివాలయం–2, 14న అమ్మగారిపల్లె, 15న యల్రాతివారిపల్లె, 16న నడిగడ్డ,17న బూరగమంద,20న తిమ్మానాయనపల్లె, 21న చెరకువారిపల్లె, 22న కంభంవారిపల్లె,23న పాలమంద సచివాలయాలలో ఈకార్యక్రమం జరుగుతుందని చెప్పారు.ఈకార్యక్రమాల్లో ముఖ్యపాత్ర జేసీఎస్ క్యాడర్‌దేనని అన్నారు. గృహసారధులు, సచివాలయ కన్వీనర్లు ఖచ్చితంగా పాల్గొనాలని చెప్పారు. ఇందుకు సంబందించిన ప్రచార సామాగ్రిని ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో తిమ్మానాయనపల్లె సర్పంచి మురళిరెడ్డి, వైసీపీ మండల కన్వీనరు రెడ్డెప్పరెడ్డి, సచివాలయ కన్వీనర్లు వెంకటరమన, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా వైసీపీ నాయకులు అందరు ఈకార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## సప్తగిరి గ్రామీణ బ్యాంకు ప్రారంభం

సదుం, నవంబరు 8 ప్రభాతవార్త:

సదుంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న సప్తగిరి గ్రామీనబ్యాంకును వీఆర్‌ఆర్ రోడ్డులోకి బుదవారం మార్చారు. నూతన భవనంలోకి వెళ్లిన ఈ బ్యాంకు శాఖను ఆబ్యాంకు జనరల్ మేనేజరు ప్రబాహరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజరు జీఎంవీ ప్రసాద్, బ్రాంచి మేనేజరు ఆర్.ఉషా, ఆఫీసర్లు బి.విజయ్, ఆర్.చక్రినాయక్,క్యాషియర్ కె.కిరణ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తాము ఎల్లప్పుడు ముందుంటామని చెప్పారు. కార్యక్రమంలో పోస్టుమాస్టర్ మురళీ,రమేష్ తదితరులు పాల్గొన్నారు

## రెగ్యులర్ మేనేజర్ లేక ఇబ్బందులు

– సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట మహిళల నిరసన

పాలసముద్రం, నవంబర్ 8 ప్రభాతవార్త:



పాలసముద్రం సప్తగిరి గ్రామీణ బ్యాంకుకు రెగ్యులర్ మేనేజర్ లేకపోవడంతో డ్వాక్రా మహిళలు రుణాల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఎదుట బుధవారం డ్వాక్రా మహిళలు తమ బ్యాంకుకు రెగ్యులర్ మేనేజర్‌ను నియమించాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకులో ఇది వరకు విధులు నిర్వహిస్తున్న మేనేజర్ అనారోగ్య కారణాల రీత్యా మూడు నెలల క్రితం సెలవుపై వెళ్ళారు. ఈ క్రమంలో బ్యాంకు ఉన్నత అధికారులు సెలవుపై వెళ్ళిన మేనేజర్ స్థానంలో పాకాల సప్తగిరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను ఇన్‌ఛార్జీ మేనేజర్‌గా నియమించారు. ఇన్‌ఛార్జీ మేనేజర్ వుండటంతో డ్వాక్రా మహిళలకు సకాలంలో రుణాలు అందడం లేదని ఈ మేరకు బ్యాంకు ఉన్నత అధికారులు తమబ్యాంకుకురెగ్యులర్‌మేనేజర్‌ను నియమించడానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టపాకాయల విక్రయాలకు అనుమతి తప్పనిసరి

పాలసముద్రం, నవంబర్ 8 ప్రభాతవార్త:

దీపావళి పండుగ పురస్కరించుకొని టపాకాయలు విక్రయించడానికి దుకాణదారులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ బి.ప్రసాద్ పేర్కొన్నారు. టపాకాయల దుకాణాల్లో వ్యాపారులు, ప్రజలు జాగ్రత్తలు పాటించి పండుగను ఉల్లాసంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ కోరారు. నివాస ప్రాంతాల్లో ఎక్కడా టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయరాదని, నిర్మానుష్య ప్రదేశంలో రేకుల షెడ్డు ఏర్పాటు చేసి అందులో దుకాణం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే అగ్ని ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్తల్లో భాగంగా దుకాణాల సమీపంలో ఇసుక, నీరు అందుబాటులో వుంచుకోవాలన్నారు. చిన్న పిల్లలు టపాకాయలు కాల్చే సమయంలో పెద్దవారు దగ్గర వుండాలని స్పష్టం చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అక్కంపేటలో బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ

తడ, నవంబర్ 8 ప్రభాతవార్త



బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ అంటూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన కార్యక్రమాలు తడ మండలంలో విస్తృతంగా నిర్వహిస్తున్నారు. సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఈ కార్యక్రమాల్లో పాల్గొంటూ ముఖ్యమంత్రిగా చంద్రబాబును ఎన్నుకోవాలని, దాని వల్ల మన భవిష్యత్తు బాగుంటుందని చెప్తున్నారు. మండల పరిధిలోని గ్రద్దగుంట పంచాయతీ అక్కంపేటలో ఈ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చింది. మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి పార్టీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్‌తో పాటు జాలర్ల సంఘం నాయకులు శివాజీ, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్యాణి, తెలుగు యువత రమేష్, గండవరం రమేష్‌రెడ్డి, రామ్మూర్తి, అక్కంపేట వాసు తదితరులు పాల్గొన్నారు.

## ఎంఆర్‌పిఎస్ విశ్వరూప మహాసభ విజయవంతం చేయాలి

: ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్ చార్జీ మంగళపూరి సురేష్ మాది

వెంకటగిరిరూరల్ నవంబర్ 8ప్రభాతవార్త:



ఈ నెల11వ తేది హైద్రాబాద్ లో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగ విశ్వరూప మహ సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ ఇన్ చార్జీ మంగళపూరి సురేష్ మాదిగ అన్నారు. బుదవారం వెంకటగిరి పట్టణంలోని బంగారుపేట,దర్మపూరం తదితర ప్రాంతాల్లో విశ్వరూప మహ సభ విజయవంతం కోసం గడప గడపకు కర పత్రాలు అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సురేష్ మాదిగ మాట్లడుతూ నవంబర్ 11వ తేది హైద్రాబాద్ లో జరిగే ఈ సభకు ముఖ్యఅతిధిగా ప్రదాని నరేంద్ర మోడి ఇచ్చేయుచున్నారని, దాని కోసం మాదిగ ఉప కూలాలు 30 సంవత్సరాల పోరాటంలో ఎస్సీ వర్గీకరణ చట్టబద్ధతకు స్పష్టమైన హమీని ప్రకటిస్తారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నియోజకవర్గ నాయుకులు ప్రశాంత్ కుమార్,రూరల్ అధ్యక్షులు తోకల మని మాదిగ,నాగరాజు తదితరులు కార్యక్రమంలో పాల్గోన్నారు.

## రాంకుమార్‌రెడ్డికి ప్రజా సేవకుడిగా మంచి గుర్తింపు

: వైసిపి సీనియర్ నాయుకులు టివి బి ప్రసాద్

వెంకటగిరిరూరల్ నవంబర్ 8ప్రభాతవార్త:

వెంకటగిరి నియోజకవర్గంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి పథకాలు తో అన్ని వర్గల ప్రజలు సుఖ సంతోషలతో ఉండటంతోపాటు వెంకటగిరి సమన్వయ కర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో బాగంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యలు తెలుసుకోవడం తోపాటు సత్వరమే సంబందిత అధికారలు మాట్లడి సమస్యలు అక్కడిక్కడే పరిష్కారం చేయడంతో ప్రజా అభిమానం పోందుకోవడం తోపాటు ప్రజా సేవకుడిగా మంచి గుర్తింపు తెచ్చుడవం విశేషమని తెలిపారు.

## ఎంపిడిఓగా బాధ్యతలు చేపట్టిన ప్రమీల రాణి



బాలాయపల్లి, నవంబర్ 8, ప్రభాతవార్త

బాలాయపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారినిగా ప్రమీల రాణి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సూళ్ళూరుపేట ఎంపిడిఓగా పనిచేస్తూ ఆమె ఇక్కడకు బదిలీ అయ్యారు. బాలాయపల్లి ఎంపిడిఓగా ఉన్న రవీంద్రబాబు సూళ్ళూరుపేట డిఎల్పిపిఓగా బదిలీ అయ్యారు. మండలంలోని సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానని ఎంపిడిఓ ప్రమీల రాణి తెలిపారు.

## వైద్యాధికారిణిగా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ లిఖిత

బాలాయపల్లి, నవంబర్ 8, ప్రభాతవార్త



స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా డాక్టర్ లిఖిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. గూడూరు ఏరియా ఆసుపత్రి నుండి ఆమె ఒక్కడకు బదిలీ అయ్యారు. బాలాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్‌గా ఉన్న కళ్యాణ్ చక్రవర్తి నెల్లూరు నారాయణ వైద్య కళాశాలలో పిజి చేసేందుకు వెళ్లారు. ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందిస్తానని డాక్టర్ లిఖిత తెలిపారు.

## వెంకటగిరి వైసిపి అభ్యర్థిగా నేనే పోటీ చేస్తా

జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి

వెంకటగిరి, నవంబర్ 8, ప్రభాతవార్త



నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నేనే పోటీ చేస్తున్నట్లు వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాం కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. వెంకటగిరి పట్టణ ఆరవ వార్డు ఎన్టీఆర్ కాలనీలో ఆయన మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆరవ వార్డులో వైసిపి కార్యకర్త తమకు ఎలాంటి సంక్షేమ పథకాలు రాలేదని అందరూ ఇబ్బంది పెట్టారని చెప్పడంతో అలాంటి సమస్య ఉండదని చెప్పారు. వెంకటగిరి వైసిపి అభ్యర్థి ఎవరుంటారోనని కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారని, అభ్యర్థి నేనేనని స్పష్టం చేసారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం మరల అధికారంలోకి వస్తుందని జగన్మోహన్ రెడ్డి సిఎం అవుతారని ఎమ్మెల్యేగా విజయం సాధిస్తానని ఆయన కార్యకర్తలకు తెలిపారు. 2024లో జరగబోయే ఎన్నికల్లో వైసిపిని అఖండ మెజారిటీతో గెలిపించాలని చెప్పారు. సైడ్ కాలువలు సిమెంట్ రోడ్డు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు వేయించాలని స్థానికులు కోరడంతో వేయించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ బాలయ్య, కమిషనర్ వెంకటరామయ్య, జిల్లా కార్యదర్శి హరికృష్ణ, నాయకులు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు మాద జానకిరామయ్య, సుబ్బారావు, పూజారి లక్ష్మి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డిదారిన సిఎం అయ్యేందుకు జగన్ ప్రయత్నాలు

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ



వెంకటగిరి, నవంబర్ 8, ప్రభాతవార్త

సిఎం జగన్ మోహన్ రెడ్డి మరల దొడ్డిదారిలో అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్నం 14వ వార్డు ధర్మాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సిఎం అయ్యేందుకు జగన్ తెలుగు దేశం పార్టీకి చెందిన ఓటర్లను తొలగిస్తున్నట్లు తెలిపారు. మా పార్టీ కార్యకర్తలు నాయకులు పార్టీకి చెందిన ఓటర్లను తొలగించకుండా చూస్తున్నట్లు తెలిపారు. వైసిపి ప్రభుత్వం రోడ్డు రవాణా సంస్థను నిర్వీర్యం చేసినట్లు చెప్పారు. విజయవాడలో బస్సు ప్రమాదం దురదృష్టకరమన్నారు. వెంకటగిరి డిపోలో కూడా ఉన్న బస్సులను రద్దు చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. వెంకటగిరి పట్టణంలో వైసిపి ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. తాగునీటి పైపు లీక్ అవుతున్నా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి ఛైర్మన్ రాజేశ్వర రావు, నాయకులు సత్యనారాయణ, సుధాకర్, నరసింహులు, చెంగారావు, తదితరులు పాల్గొన్నారు.

## సయ్యద్ తాజుద్దీన్ సేవలు అభినందనీయం

గూడూరు, నవంబర్ 8 ప్రభాతవార్త



గూడూరు డివిజన్ వ్యాప్తంగా ఏన్నో సేవా కార్యక్రమాలను నిర్వహి స్తున్న సయ్యద్ తాజుద్దీన్ సేవలు అభినందనీయమని వైస్సార్ చారిటుల్ ట్రస్టు ఛైర్మెన్ బత్తిన విజయకుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని డిఆర్ డబ్ల్యు కళాశాలలో సయ్యద్ తాజ్దున్‌కు డాక్టరేట్ ప్రధానం చేసిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా విజయకుమార్ పాల్గొన్ని తాజుద్దీన్ సేవలను కొనియాడారు. దివంగత రాష్ట్రపతి పేరిట డా.ఎపీజేఅబ్దుల్ కలాం ట్రస్ట్ ఏర్పాటు చేసి ఏన్నో సేవ కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. అనంతరం ఆయనను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా అభ్యుదయ సేవా సమతి అధ్యక్షుల దగ్గోలు సరేంద్రబాబు, ప్రిన్సిపల్ హనుమంతరావు, మీడియా కన్వీనర్ గంపల చందు, మనోజ్ కుమార్,తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి జగనే ఎందుకు కార్యక్రమం

తడ, నవంబర్ 8 ప్రభాతవార్త

గురువారం నుంచి తడ మండలంలోని వివిధ సచివాలయాలలో ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఆమోస్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమం గురువారం భీములవారిపాలెం నుంచి ప్రారంభమవుతుందని, 10న అండగుండల, 14న గ్రద్దగుంట, 15న ఇరకం, 16వ తేదీ కాదలూరు, 17న కారూరు, 20న కొండూరు, 21న మాంబట్టు, 22న పెరియవట్టు, 23వ తేదీ పూడి గ్రామాల్లో నిర్వహిస్తున్నామని ఎంపిడిఓ వివరించారు.

## చేపల చెరువు వేలం పాట

బాలాయ్యపల్లి, నవంబర్ 8, ప్రభాతవార్త



బాలాయ్యపల్లి మండలంలోని కాలగంద గ్రామ పంచాయితీ కార్యాలయంలో గురువారం చేపల చెరువు వేలం పాట ఈఓపిఆర్డి శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలం పాటలో మొత్తం నలుగురు పాల్గొనగా అందులో హెచ్చు పాటదారుడైన వయ్యావూరు పోలయ్య 38000 రూపాయిలకు పాడుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మోహన్ రాజు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

## గ్రంథాలయ శాఖచే విద్యార్థులకు వివిధ రకాల పోటీలు

కుప్పంరూరల్/శాంతిపురం,నవంబర్ 8 ప్రభాతవార్త



56వ జాతీయ గ్రంథాలయ దినోత్సవాలను పురస్కరించుకుని కుప్పం, శాంతిపురం గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ రకాల పోటీలను నిర్వహించారు. కుప్పం గ్రంథాలయంలో పదాల గుర్తింపు, స్పాట్ టాఫిక్ పోటీలు నిర్వహించారు. శాంతిపురం గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు, మ్యూజికల్ ఛైయిర్స్, జగనన్న విద్యాదీవెన, డిజిటల్ లైబ్రరీలు అనే అంశాలపై వ్యాసరచన, వకృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణులు సత్యవాణి, సుభాషిణి, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు వైకాపా బూత్ కమిటీలకు శిక్షణ

శాంతిపురం, నవంబర్ 8 ప్రభాతవార్త

శాంతిపురం మండలంలోని వైకాపా బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులకు గురువారం విజలాపురం మురుగేష్ కళ్యాణమండపంలో శిక్షణ తరగతులు జరుగుతాయని మండల కన్వీనర్ దండపాణి తెలిపారు. సమావేశంకు ఎమ్మెల్సీ భరత్, ఐప్యాక్ బృందం హాజరవుతుందన్నారు. బూత్ కన్వీనర్లు, సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసిలు తప్పక హాజరు కావాలని కోరారు.

## బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో విద్యార్థినుల విజయకేతనం

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త



శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ ఈనెల 7,8వ తేదీల్లో నిర్వహించిన అంతర కళాశాలల మహిళల పోటీల్లో తెలుగుగంగ కాలనీలో ఉన్న ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని విజయకేతనం ఎగురవేశారు. గత కొన్ని సంవత్సరాలుగా రన్నర్స్‌గా రాణిస్తున్నప్పటికీ 16 సంవత్సరాల తర్వాత తిరిగి విన్నర్స్‌గా నిలవడంతో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు వ్యాయామ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థినులను మరియు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారావును ప్రిన్సిపల్ డాక్టర్ బి.రాజశేఖర్, కళాశాల ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు, న్యాయవాది మరియు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షులు వెంకటస్వామి కళాశాల సూపరింటెండెంట్ శివకుమార్ మరయు ఇతర అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

## అరాచక ప్రభుత్వానికి ప్రజలే బుద్ధిచెప్తారు

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త



జనసేన విజయయాత్రలో భాగంగా సోమవారం 'ఏపి నీడ్స్ పవన్‌కళ్యాణ్' కార్యక్రమంలో భాగంగా బుధవారం తొట్టంబేడు మండల కేంద్రానికి సమీపంలో ఉన్న సాయిబాబాగుడి కాలనీ వినాయకనగర్‌లో నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి వినుత.కోట కైలాసగిరి కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఈరాష్ట్రానికి పవన్‌కళ్యాణ్ నాయకత్వం ఆవశ్యకతను వివరిస్తూ ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర ప్రజలకు చేస్తున్న మోసాన్ని, దోపిడీలను వివరించారు. రానున్న ఎన్నికల్లో జనసేన-టిడిపి ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. శ్రీకాళహస్తి పట్టణంలోను, మండలంలోను వైసిపి ప్రభుత్వం అరాచకాలను వివరిస్తూ ఇంటింటికి వెళ్ళి కరపత్రాలను పంపిణీచేశారు. ఎంఎల్‌ఏ అనుచరులు టైలర్స్ కాలనీలో ప్లాట్లను కబ్జాచేశారని కొంతమంది మహిళలు తెలిపారు. జనసేన టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో మొత్తం కబ్జాలకు గురైన ప్రతి సెంటును వెనక్కు తీసుకుని బాధితులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు తోటగణేష్, మండల అధ్యక్షుడు కొప్పలగోపి, ప్రధాన కార్యదర్శి పేటచిరంజీవి, రవికుమార్‌రెడ్డి, లక్ష్మి, శారద, బత్తెమ్మ, నిర్మల , గురవయ్య, రాజేష్, సురేష్, రాం, చిన్నమునెయ్య, శబరి, రాజేష్, మధు, శ్రీను, హేమంత్, వెంకీ, భాను తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు స్వేచ్ఛ లేదు.సమాజంలో అభివృద్ధి లేదు

రిషితరెడ్డి

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త



నాలుగున్నర ఏళ్ళుగా శ్రీకాళహస్తిలో ఏమైనా అభివృద్ధి జరిగిందా? మున్సిపాలిటికి ఎన్నికలు జరిపించారా? కోర్టుల్లో కేసులు ఉంటే వాటిని పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది కాదా? వేరేవరు పరిపాలనలో ఉండరాదన్నది పాలకుల ఎత్తుగడ అని శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి బొజ్జల రిషితారెడ్డి అన్నారు.ఆమె బుధవారం శ్రీకాళహస్తి మున్సిపల్ పరిధిలోని 10వ వార్డులో ఇంటింటికి మీ బొజ్జల కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె ఓ వైపు ప్రభుత్వ వైఫల్యాలను మరో వైపు మున్సిపాలిటికి ఎన్నికలు జరిపించకపోవటాన్ని విమర్శిస్తూ ముందుకు సాగారు. నేడు సామాన్యుడు బతికే పరిస్థితి ఉందా? అని ప్రశ్నించారు. అందరికి పెన్షన్లు ఇస్తున్నామని చెబుతున్న పాలకులు వివిధ నిబంధనలతో పెన్షన్లు తొలగిస్తున్న వారి మాటేమిటని ప్రశ్నించారు.సరాసరి ఖాతాల్లో జమలు చేస్తూ ఓవైపు అధిక ధరలతో మరో వైపు మద్యం ధరలతో నిలువుదోపిడి చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమాలను పట్టణ అధ్యక్షుడు జి.విజయకుమార్ ఏర్పాటు చేసారు.వార్డు ఇన్‌చార్జి మస్తాన్, యూనిట్ ఇన్‌చార్జి కరీం, బాబు, మహీంద్ర,గౌతమి, భానుబేగం, నజుని, అంకమ్మ, ఫక్రుద్దీన్, సురేష్,రవినాయుడు,సతీష్‌లు పర్యవేక్షించగా పార్టీ నాయకులుసుమతమ్మ, మల్లీశ్వరి, సుభాషిణి, వెంకటేశ్ చౌదరి, మునికృష్ణ, భాస్కర్, ఎంఎస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, మునిరాజా యాదవ్, కిట్టు, మీర్జా, సాయి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశ్వరూప మహాసభ కరపత్రాలు పంపిణీ

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త



ఈనెల 11వ తేదీన హైదరాబాదులో నిర్వహించే విశ్వరూప మహాసభ కరపత్రాలును మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు, జనసేన నియోకవర్గ ఇన్‌ఛార్జి వినుత కోటలకు ఎంఆర్‌పిఎస్ నాయకులు పంపిణీచేశారు. సభను విజయవంతం చేసేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి రాధాకృష్ణమాదిగ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇర్లరాజామాదిగ, ఎంఆర్‌పిఎస్ సీనియర్ నాయకులు మాతయ్యమాదిగ, చంద్రమాదిగ, ఈశ్వర్‌మాదిగ, పట్టణ అధ్యక్షుడు యతేష్‌మాదిగ, యువసేన అధ్యక్షులు వెంకటమునిమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణంలో ప్రజల సమస్యలను పరిష్కరించండి సారూ..

శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త



నియోజకవర్గంలో జనసేన విజయయాత్ర పేరుతో ఇంటింటికి ప్రచారం చేస్తున్నపుడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజల సమస్యలు జనసేన పార్టీ దృష్టికి తీసుకుని రావడంతో కనీస అవసరాలు అయిన త్రాగునీరు, వీధిలైట్లు కూడా లేదని ప్రజల ఇబ్బందులు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు దృష్టికి తెచ్చారు. లోబావి ఎస్‌టి కాలనీ, కైలాసగిరిలో త్రాగునీరు, వీధిలైట్లు లేవని , కొండమిట్ట, తుఫాన్‌సెంటర్, బహదూరుపేట, శ్రీరాంనగర్ కాలనీ, భాస్కరపేట, గోపాలవనం, హౌసింగ్‌బోర్డు తదితర ప్రాంతాల్లో వీధిలైట్లు లేకుండా ప్రజల ఇబ్బందులు పడుతున్నారని కమిషనర్ దృష్టికి జనసేన ఇన్‌ఛార్జి వినుతకోట తెలిపారు.ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రానున్న పదిరోజుల్లో పూర్తిస్థాయిలో అన్ని ప్రాంతాల్లో వేస్తామని హామీ ఇచ్చారు. లోబావి ఎస్‌టి కాలనీ, కైలాసగిరి కాలనీలో నీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షుడు తోటగణేష్, ప్రధాన కార్యదర్శులు రవికుమార్‌రెడ్డి, పేటచిరంజీవి, నాయకులు శ్రీరాం, బత్తెమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతిలో కావేరీ ఆస్పత్రి వైద్యసేవలు

తిరుపతిటౌన్,నవంబర్ 8 ప్రభాతవార్త:



వైద్యహబ్‌గా రూపుదిద్దుకుంటున్న తిరుపతినగరంలో కావేరీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రివైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇందుకోసం తిరుచానూరురోడ్డు పద్మావతిపురం సమీపంలోని కొరమేనుగుంటలో కావేరీ ఆస్పత్రి క్లినిక్, సమాచార కేంద్రం ప్రారంభమైంది. తిరుపతి వాసులకు, పరిసరాల్లోని ప్రజలకు ఈ ఆస్పత్రి నాణ్యమైన అన్ని రకాల వైద్యసేవలు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు ఆస్పత్రి యాజమాన్యం తెలిపింది. చెన్నైరేడియల్‌రోడ్డులోని కావేరీ ఆస్పత్రి యాజమాన్యం నిపుణులైన వైద్యబృందంతో కలసి మెరుగైన ఆరోగ్యసంరక్షణ సేవలు అందిస్తోందని, 6 నగరాల్లో, 10 ఆస్పత్రులు కలిగి, అధునాతనమైన వైద్యపరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. తిరుపతిలోని క్లినిక్‌లో న్యూరాలజీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ, యూరాలజీ, నెఫ్రాలజీ ఇతర వైద్యవిభాగాల్లో నైపుణ్యం ఉన్న అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు.

## పేరడంలో వంక కాలువ పూడ్చివేత

-చోద్యం చూస్తున్న రెవిన్యూ అధికారులు

సత్యవేడు, నవంబర్ 8, ప్రభాతవార్త :



మండలంలోని పేరడం గ్రామంలో ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. ఇప్పటికే కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని ఇళ్ళ నిర్మాణాలు చేపడుతూ, ప్రభుత్వ భూములు తమవే నంటూ కంచెలు వేసుకుంటున్న దాఖలాలు ఉన్నాయి. ఇది చాలదన్నట్టుగా ఏకంగా వంక కాలువను ఆక్రమించుకుని పూడ్చి వేయడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పేరడం గ్రామం సమీపంలో పుదుకుప్పంకు చెందిన ఓ రైతు వంక కాలువను పూడ్చివేసి మామిడి మొక్కలు సాగుకు ఏర్పాట్లు చేస్తున్నాడు. వర్షపునీరు, అడవి నుంచి వచ్చే వరదనీరు ఈకాలువ ద్వారా రెడ్డిగుంట చెరువుకు చేరుతుంది. ఆరు మీటర్ల వెడల్పు ఉన్న ఈ వంక కాలువను ఆనుకుని సదరు రైతు సాగుభూమి ఉండటంతో ఇక్కడ ఆ రైతు ఆక్రమణకు పాల్పడుతున్నట్లు గ్రామస్తులు చెపుతున్నారు. దీందో వరదనీరు రోడ్లపై నిలిచి, ముంపునకు గురయ్యే అవకాశాలు లేకపోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి భూమిపూజ

వరదయ్యపాలెం, నవంబర్ 8, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండలంలో సంత వేలూరు ఎస్టీ కాలనీలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం పది లక్షల రూపాయిల నిధులతో భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. భూమి పూజ కార్యక్రమం నిర్మాణానికి చొరవ చూపిన ఎమ్మెల్యే ఆదిమూలంకి గ్రామస్తులు, వైసిపి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరదయ్యపాలెం ఎంపిపి పద్మ ప్రియ భర్త దామోదర్ రెడ్డి, జడ్పిటిసి సభ్యులు వెంకటేశ్వర్లు, వరదయ్యపాలెం మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి, వరదయ్యపాలెం మాజీ సర్పంచ్ చిన్న, వైసిపి నాయకులు మహేంద్ర, మురళిరెడ్డి, స్థానిక సర్పంచ్ వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీఆర్ సంస్థ నుండి ఐడి కార్డు అందుకున్న రాణిపేట మక్‌సుధ్

వరదయ్యపాలెం, నవంబర్ 8, ప్రభాతవార్త



వరదయ్యపాలెం మండలం ముస్లిం పాలెం గ్రామానికి చెందిన రాణిపేట మక్ సుద్ 4.7.23న సీసీఆర్ ఐడి కార్డు పొందుటకు కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్ సంస్థ ఆన్‌లైన్ ఫామ్ నింపి, సంస్థ నందు సభ్యులుగా కొనసాగుటకు అర్హత పొందారు. ఇతనిపై సంస్థ విచారణ జరిపి ఐడి నెంబర్‌ను కేటాయించింది. 8.11.23న అతని వద్ద నుండి 20 ఇండియన్ నాన్ జ్యుడిషల్ ఈ స్టాంప్ పేపర్ నందు స్వీయ అఫిడవిట్‌ను, సీనియర్ ప్రతినిధులు శిరీష్ బాబు, ఎలియేజార్ పళ్లిపట్టులు సీసీఆర్ జేఎస్ గుత్తి త్యాగరాజు సమక్షంలోఅఫిడిట్ అందుకున్నారు. అఫిడవిట్‌ను పరిశీలించి సిసిఆర్ జేఎస్ గుత్తి త్యాగరాజు, సిసిఆర్ ఐడి కార్డు ఇంచార్జి అండ్ జోనలల్ సెక్రటరీ తిరుపతికి చెందిన మార్గబందు లోకేష్ ద్వారా అందుకున్నారు. సిసిఆర్ / 231791 అను నెంబర్ గల ఐడి కార్డును అందజేసారు.

## తూర్పు మండలాల్లో దేశం విజయానికి కృషి చేయండి

మాజీ ఎంఎల్‌ఏ ఎస్‌సివికి లోకేష్ సూచన

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త



తిరుపతిజిల్లాలోనూ, చిత్తూరు జిల్లాలో పార్టీని విజయపథంలో నడుపుటకు ప్రతి ఒక్కరు పని చేయాలని, కార్యకర్తలను చైతన్య పరచాలని తెలుగుదేశం జాతీయ కార్యదర్శి నారాలోకేష్ దిశ దెశ నిర్దేశం చేసారు. బుధవారం విజయవాడలో నారాలోకేష్‌ను మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు కలిసారు. ఈ సందర్భంగా నారాలోకేష్ మాట్లాడుతూ శ్రీకాళహస్తి,సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో పార్టీని విజయపథంలో నడపాలన్నారు. ప్రతిపక్షం తెలుగుదేశం మీద కక్ష కట్టి వ్యవహరిస్తున్నారు. కార్యకర్తలను నాయకులను కేసుల్లో ఇరికిస్తున్నారు.కాబట్టి జాగ్రత్తగా అడుగులేయాలని లోకేష్ సూచించారు.అంతేకాక నేడు అధికార పార్టీ వారికి మద్దతు లేకుండా ఉన్న వారి ఓట్లను తొలగించటం అంతేకాక తెలుగుదేశం పార్టీ ఓట్లపై వాలంటీర్ల ద్వారా కన్నేసి తొలగిస్తున్నారని ఎస్‌సివికి వివరించారు. నాలుగునియోజకవర్గాల్లో పార్టీ కార్యకర్తలను చైతన్య పరుస్తూ వారికి అండగా ఉంటూ విజయపథంలో నడపాలన్నారు. ఈ సందర్భంగా ఎస్‌సివి నాయుడు స్థానిక పార్టీలో చోటు చేసుకున్న పరిస్థితులను నారా లోకేష్‌కు వివరించారు. ఆయనతో పాటు మాజీ ఎంపిటిసి సుబ్రమణ్యం, జి.భాస్కర్‌నాయుడు ఉన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి-యువతకు ఉపాధి

రాష్ట్ర కార్యదర్శి చలపతినాయుడు

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త



చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి జరగడంతో యువతకు ఉపాధి కలుగుతుందని రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడులు అన్నారు. బుధవారం మండలంలోని పొయ్యపంచాయతీ పొయ్యకొత్తూరు, కొమ్మనగుంట గ్రామాల్లో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య్రమంలో భాగంగా గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికి తిరిగి తెలుగుదేశంపార్టీ ప్రవేశపెట్టిన మహాశక్తి వంటి పథకాలను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి తిరిగి పత్రాలు అందించి చంద్రబాబునాయుడు మచ్చలేని మహా నాయకుడుగా వెలుగొంది ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడం తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీనే గెలుపుగా ప్రతి ఒక్కరు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి విజయకుమార్‌నాయుడు, మాజీ ఆయకట్టు అధ్యక్షుడు గోవర్ధన్‌నాయుడు, టిఎన్‌టియుసి అధ్యక్షులు సునీల్‌కుమార్, ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.సునీల్‌కుమార్, బత్తెయ్య, గాలిసురేంద్రనాయుడు, ధీరత్‌చౌదరి, నారాయణనాయుడు, భార్గవ్‌చౌదరి, రాజేష్, జనార్ధన్, ఈశ్వర్‌నాయుడు, గుర్రప్ప, ప్రేమ, రాము,జయసుధ, లక్ష్మి తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ప్రతిభావంతులకు ఆటవస్తువులు పంపిణీ

తొట్టంబేడు, నవంబర్ 8 ప్రభాతవార్త



మండలంలోని బసవయ్యపాళెం వద్ద ఉన్న భవితకేంద్రంలో శిక్షణ పొందిన కొత్త కన్నలి ఎస్టీకాలనీకి చెందిన కె.ధనశేఖర్ అనే విద్యార్థి ప్రమాద శాత్తు 2016లో మృతి చెందాడు. అప్పటి నుంచి ప్రతి ఏడాది మృతుని కుటుంబ సభ్యులు విద్యార్థి జ్ఞాపకార్థం బుధవారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రంలో ఉన్న వారికి నోటు పుస్తకాలు, పెన్సిల్స్, రబ్బర్లు, స్వీట్లు పంపిణీచేశారు. ఈ సందర్భంగా దాతలు మాట్లాడుతూ ప్రత్యేక ప్రతిభావంతులకు వారికి కావాల్సిన సామగ్రిని, ఆటవస్తువులను అందించడం తమకు ఎంతో సంతోషాన్నిస్తుందన్నారు. ప్రభుత్వం భవిత పాఠశాలలు ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇవ్వడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ప్రతిభావంతులు చిన్నారులు, సహిత పాఠశాల ఉపాధ్యాయులు చైతన్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రథయాత్రతో దేశ ఔన్నత్యాన్ని చాటిన నేత అద్వానీ

తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త:



ఉపప్రధానమంత్రిగా ఎల్‌కె అద్వానీ దేశవ్యాప్తంగా రథయాత్రను చేపట్టి భారతదేశ ఔన్నత్యాన్ని చాటిచెప్పారని, బిజెపికి పూర్వవైభవం తీసుకురావడంలో తన భుజాలపై పార్టీని నడిపారని బిజెపి నాయకులు కొనియాడారు. అద్వానీ జన్మదినం సందర్భంగా బుధవారం తిరుపతిలోని గంగమ్మ ఆలయంలో ఆయన పేరున బిజెపి ,అనుబంధ విభాగాల నాయకులు గుండాల గోపీనాథరెడ్డి, వెంకటేష్ యాదవ్, పెనుబాల చంద్రశేఖర్, అనూష రామకృష్ణ, విజయ్‌కుమార్, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, కవిత, కెఎన్ రాజా,కస్పా పద్మనాభమ్, పొన్నాల జెజిరెడ్డి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు.

# తిరుపతి డివిజన్

## కరాటే పోటీల్లో తిరుపతి విద్యార్థుల ప్రతిభ

తిరుపతి (క్రీడ), నవంబర్ 8, ప్రభాతవార్త



ఖమ్మంలో ఈ నెల 7వ తేది సినీ హీరో సుమన్ తల్వార్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే పోటీల్లో దాదాపు 1500 మంది విద్యార్థులు పాల్గొనగా తిరుపతికి చెందిన విద్యార్థులు వివిధ ఏజ్ క్యాటగిరిలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్స్ 7 ఇయర్స్ క్యాటగిరి విభాగంలో కె. పవన్ తేజష్ వర్మ, కటా విభాగంలో గోల్డ్ మెడల్ కమితే విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించగా, 8 ఇయర్స్ క్యాటగిరిలో పి. కీర్తన శెట్టి కటా, కుమితే విభాగంలో గోల్డ్ మెడల్స్ కైవసం చేసుకున్నాడు. అలాగే 3 ఇయర్స్ గర్ల్స్ క్యాటగిరిలో పి. కీర్తికా శెట్టి కటా, కుమితే విభాగంలో గోల్డ్ మెడల్స్ సాధించగా అలాగే 11 ఇయర్స్ క్యాటగిరిలో పి. హేమకీర్తన్ కుమితే విభాగంలో గోల్డ్ మెడల్ కటా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. అలాగే 13 ఇయర్స్ క్యాటగిరిలో పి. సాయి సంతోష్ కుమితే విభాగంలో సిల్వర్ మెడల్ కైవసం చేసుకున్నాడు. కరాటే మాస్టర్ శేఖర్ ప్రత్యేక శిక్షణ ఇవ్వడం వలనే అత్యున్నత ప్రతిభ కనబరిచారు.

## ప్రజల భవిష్యత్‌కు టిడిపి గ్యారంటీ

గంజి మాధవయ్య

పుత్తూరు, నవంబరు 8 ప్రభాతవార్త :



వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని విధాలా వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తెలుగుదేశం పార్టీ గ్యారంటీ ఇస్తుందని అందుకు పార్టీ అధినేత చంద్రబాబునాయుడు భరోసా కల్పిస్తారని టిడిపి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య అన్నారు. భవిష్యత్‌కు గ్యారంటీ, బాబు ష్యూరిటీ కార్యక్రమాన్ని ఆయన ఆధ్వర్యంలో బుధవారం రూరల్ మండలం పరిధిలోని పరమేశ్వరమంగళం పంచాయతీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు చదివితే అందరికీ డబ్బులిస్తామని ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కేవలం ఇంట్లో ఒకరికి మాత్రమే అమ్మఒడి ఇస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి వస్తే ఇంట్లో ఎంత మంది చదివితే అందరికీ తల్లికి వందనం పథకం కింద లబ్ది చేకూరుస్తామని తెలిపారు. యువతకు నిరుద్యోగ భృతి ఇస్తామని తెలిపారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ టిడిపి మినీ మ్యానిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. కార్యక్రమంలో పార్టీ రూరల్ , పట్టణ అధ్యక్షులు డి.రవికుమార్, గాలి జీవరత్నంనాయుడు, రూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజీ, నాయకులు సుధాకర్‌నాయుడు, లక్ష్మీపతినాయుడు, కరుణ యాదవ్, బొబ్బిలి యాదవ్, జయకర్, కోట గజపతి తదితరులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

పుత్తూరు, నవంబరు 8 ప్రభాతవార్త :

జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు సత్వర పరిష్కారం చూపించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ భాస్కర్‌నాయుడు వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మునిసిపాలిటీలో బుధవారం జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి గ్రామ, మండల స్థాయి అధికారులతో పాటు జిల్లా అధికారులు అందుబాటులో వుండి ప్రజల సమస్యలను పరిష్కరిస్తారని తెలిపారు. ప్రజల నుంచి మునిసిపల్ పరిపాలనకు సంబంధించి 45 అర్జీలు వచ్చాయి. అలాగే రెవెన్యూ శాఖ 18, గృహ నిర్మాణ శాఖ 14, మౌలిక సదుపాయల సంస్థ 7, సర్వే శాఖ 3, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 3, స్కూల్ ఎడ్యుకేషన్ 2, వ్యవసాయ శాఖ 2, విద్యుత్ శాఖ 2, రిజిస్ట్రేషన్ 1, కాలేజీ ఎడ్యుకేషన్ 1, పోలీస్ శాఖ 1, వైద్య శాఖకు సంబంధించి 1 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో పుత్తూరు మునిసిపల్ కమిషనర్ కె.ఎల్.ఎన్.రెడ్డి, డిఎల్‌డిఓ సుశీలదేవి, ఎంపిడిఓ ప్రసాద్, తహశీల్దారు పరమేశ్వరస్వామి, పిడి డిఆర్‌డిఏ జ్యోతి, ఐసిడిఎస్ పిడి జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆసుపత్రిలో ఆయుధపూజ

చంద్రగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త:



చంద్రగిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో బుధవారం ఆయుధ పూజ ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మొదట ఆసుపత్రి ప్రధాన ద్వార ం వద్ద గల శ్రీవినాయక స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి ఆసుపత్రి మొదటి అంతస్థులోని ఆపరేషన్ థియేటర్ వద్ద వివిధ దేవతామూర్తుల చిత్రపటాలను విశేష అలంకరణలతో తీరిదిద్దారు. అర్చకులు దుర్గాదేవికి వివిధ పూజలు నిర్వహించి, ఆయుధపూజ చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రసాద్, కమిటీ సభ్యులు బి.అచ్యుత విజయ్‌కుమార్ రెడ్డి, రెడ్డెప్ప, విరూపాక్షి మమత శంకర్ రెడ్డి, వైద్యులు డాక్టర్ కవిత, డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ హిమబింధు, డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ స్పందన, డాక్టర్ కీర్తి, డాక్టర్ రవీంద్రనాద్ ఠాగూర్, డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ చంద్రమోహన్, డాక్టర్ హేమంత్, డాక్టర్ చూష్మారెడ్డి, డాక్టర్ సస్యశ్రీ, డాక్టర్ సుబ్బారెడ్డి, డాక్టర్ పద్మజ, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

## ఎన్.ఆర్.కమ్మపల్లికి మూడు పోలింగ్ కేంద్రాలు సమంజసమా..?

టిడిపి సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి

రామచంద్రాపురం, నవంబర్ 8 ప్రభాతవార్త:



ఎన్.ఆర్.కమ్మపల్లి పంచాయతీకి మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం సమంజసమా అంటూ టిడిపి సీనియర్ నాయకుడు జనార్ధన్ చౌదరి అన్నారు. ఎన్.ఆర్.కమ్మపల్లికి చెందిన పోలింగ్ కేంద్రం నంబర్ 361ని యధావిధిగా పంచాయతీలోనే కొనసాగించాలని కోరుతూ బుధవారం ఆయన డిప్యూటీ తహశీల్దార్ పునీతకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్.ఆర్.కమ్మపల్లిలోని 361 పోలింగ్ కేంద్రంలో గతంలో 699 ఓట్లు వుండేవన్నారు. ఈ ఓట్లను రాజకీయ కక్షపూరితంగా నెత్తకుప్పం పోలింగ్ కేంద్రం 360లోనికి 239 ఓట్లను బదిలీ చేసినట్లు తెలిపారు. సి.కె.పల్లి పోలింగ్ కేంద్రంలోని 376 పోలింగ్ కేంద్రానికి 242 ఓట్లను బదిలీ చేసినట్లు తెలిపారు. ఎన్.ఆర్.కమ్మపల్లి పోలింగ్ కేంద్రం 361లో కేవలం 220 ఓట్లు మాత్రమే పరిమితం చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తమ పోలింగ్ కేంద్రంలో ఓట్లను తమ గ్రామంలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ కమ్మపల్లి టిడిపి బూత్ కన్వీనర్ చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## సైనిక స్కూల్ ఎంట్రన్స్‌కు దరఖాస్తులు ఆహ్వానం

తిరుపతి క్రీడ, నవంబర్ 8 ప్రభాతవార్త

తిరుపతి వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం పోటీ పరీక్షల 2024..25 విద్యా సంవత్సరానికి జాతీయ స్థాయి సైనిక స్కూల్ ప్రవేశ పరీక్ష ద్వార 6,9,వతరగతుల ప్రవేశానికి సంబంధించి దరఖాస్తులను నవంబరు 8 నుంచి డిసెంబరు 16 వరకు స్వీకరిస్తారని కోచింగ్ పెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యాక్షులుఎన్.విశ్వఆథ్ రెడ్డి నేడు ఒక ప్రకనటలో తెలిపారు. మరిన్నో వివరాలు కొరకు 8688888802 03,9399976999 సంప్రదించవచ్చుని తెలిపారు

## ఏపీకి జగనే ఎందుకు కావాలంటేకార్యక్రమం - ఎమ్మెల్యే

పిచ్చాటూరు, నవంబరు 8 ప్రభాతవార్త:

99.5 శాతం మేనిఫెస్టో అమలు చేస్తూ అభివృద్ధిలోను ముందున్నామనే నిజంతో ప్రజల్లోకి వెళ్లే కార్యక్రమం విద్య, వైద్యానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యత మేనిఫెస్టో అమలే ప్రభుత్వానికి గీటురాయి సంక్షేమం కోసమే అభివృద్ధి సంక్షేమంతోనే అభివృద్ధి అని సీఎం జగన్ నిరూపించారని ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. పిచ్చాటూరు పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ రాష్ట్ర వ్యాప్తంగా గురువారం నుంచి(వై ఏపీ నీడ్స్ జగన్ ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే) కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. జగన్ ప్రజా సంకల్ప యాత్రలో ప్రజల నుంచి వచ్చిన ఆకాంక్షలతోనే మా పార్టీ మేనిఫెస్టో రూపొందిందని తెలిపారు. నాలుగున్నర ఏళ్ళలో మా ప్రభుత్వం ఏం చేసిందో వివరిస్తామని అన్నారు. రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన పురోగతి, సానుకూల మార్పులను నివాసితులు అర్థం చేసుకోవడానికి, అభినందించడానికి ఈ సమాచార బుక్‌లెట్ విలువైన వనరుగా ఉపయోగపడుతుందన్నారు. ప్రతి మండలంలో పార్టీ జెండా ఆవిష్కరణ చేస్తారని ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రదర్శి స్తామని, ఆ గ్రామానికి జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రదర్శిస్తామని తెలిపారు. వైసీపీ మండల కన్వీనర్ వెంకట చలపతిరాజు, సచివాలయ కన్వీనర్ తొప్పయ్య, వైసీపీ ఉపాధ్యక్షుడు రమేష్‌రాజు, మణిలు పాల్గొన్నారు.

**తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ, తిరుపతి**

**ఈ సంస్థ యొక్క ఖాళీ గదులకు**
**బహిరంగ వేలము తేది: 20.11.2023**

ఈ సంస్థ యొక్క 3 ఖాళీ గదులకు నెలసరి అద్దె (లీజ్) ప్రాతిపదికన కేటాయించుటకు బహిరంగ వేలము నిర్వహించ బడును. వేలము నిర్వహణకు దరఖాస్తులు, ధరావతులు మరియు ఇతర వివరముల కొరకు ఈ కార్యాలయపు పని వేళలందు సంబంధిత సిబ్బందిని సంప్రదించవచ్చును.

సం/- యస్.హరికృష్ణ, యం.ఏ, యం.ఫిల్, ఉపాధ్యక్షులు, తుడా, తిరుపతి

## నేడు మాక్ పోలింగ్

**- జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్**



చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: జిల్లాకు కేటాయించిన ఇవిఎంల మొదటి లెవల్ చెకింగ్ పూర్తి కావచ్చిందని, ఇందుకు సంబంధించి గురువారం మాక్ పోలింగ్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా రెవెన్యూ అధికారి రాజశేఖర్ అన్నారు. ఈ మాక్ పోలింగ్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొనవచ్చునని తెలిపారు. డిఆర్‌ఓ సమావేశమందిరంలో బుధవారం డిఆర్‌ఓ రాజశేఖర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మాట్లాడుతూ గురువారం జరిగే మాక్ పోలింగ్ ద్వారా ఇవిఎంలు, వివిప్యాడ్‌ల పనితీరును పరిశీలించుకోవచ్చునన్నారు. కలెక్టరేట్‌లోని ఇవిఎం గోడౌన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, అనుమతి వున్న రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావచ్చునన్నారు. దీనికి ఎన్నికల కమీషన్ నియమ నిబంధనలు అనుసరించాల్సి వుంటుందని, ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు లేదా తీసివేతల విషయంలో వచ్చిన అభ్యర్ధనలను క్షేత్ర స్థాయిలో బిఎల్‌ఓలు పరిశీలించి సంబంధిత క్లైములను పూర్తి చేయాలన్నారు. అభ్యర్ధనలు వచ్చిన ఇంటికి వెళ్ళకుండా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని ఇలా చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అలాగే పోలింగ్ స్టేషన్‌ల వారీగా దరఖాస్తులు పంపడం జరుగుతుందని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల విషయంలో రెండు శాతంకు పైగా ఒక ప్రాంతంలో నమోదు అయితే ఇఆర్‌ఓలు వెళ్ళి క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలన్నారు. ఓటర్ల జాబితా నుండి తీసివేతలు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఎన్నికల కమీషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించి సకాలంలో పూర్తి చేయాలన్నారు. తెలుగుదేశం నాయకులు మాజీ ఎమ్మెల్సీ బిఎన్.రాజసింహులు, వెంకిటీల సురేంద్రకుమార్‌లు, బిఎస్పీ నాయకులు సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిరసిస్తూ చేసిన బంద్ విజయవంతం



చిత్తూరురూరల్, నవంబరు 8 ప్రభాతవార్త: విశాఖ ఉక్కు ప్రైవేటీ కరణను నిరసిస్తూ బుధవారం విద్యార్థి సంఘాలైన ఏఐఎస్ఎఫ్, టిఎన్ ఎస్ఎఫ్, బిఎస్‌యులు నిర్వహించిన బంద్ విజయవంతమైంది. టిఎన్ఎస్ ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభు తేజ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌లు మాట్లాడుతూ విశాఖ ఉక్కును రాష్ట్రప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో కలసి ప్రైవేటీకరణ చేయడానికి చూస్తున్నారన్నారు. 32 మంది ప్రాణత్యాగంతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేటీకరణకు అప్పగిస్తే 50 వేల నుంచి 2లక్షల మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోతారన్నారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అని, అలాంటి విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేస్తే రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానికి తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటీకరణను ఆపకపోతే రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలతో కలసి ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు గూగుల్ ఆదిత్య, నగర అధ్యక్షుడు జగన్, గుడిపాల మండల అధ్యక్షుడు శ్యాంప్రసాద్, భగత్‌సింగ్ స్టూడెంట్స్ నాయకులు చైతన్య, తరుణ్, వినయ్, కుల్దీప్, ముని, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఎదురులేని పార్టీగా రాబోవు ఎన్నికల్లో గెలిపించండి

**అందరం కలసి పని చేద్దాం... ప్రతిపక్షం లేని ఊరుగా మారుద్దాం**

**ఎంఎల్ఏ బియ్యపు మధుసూధనరెడ్డి**



శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి మున్సిపాలిటిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేద్దామని, అందరం కలసి పనిచేసి వైకాపాకు తిరుగులేదని నిరూపిస్తామని అందుకు అందరు సహకరించాలని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. 18వ వార్డులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మధుసూధనరెడ్డి పూసల వీధిలో గడప గడపకు తిరిగారు. గతంలో ఏ వార్డులోనూ లభించని స్పందన ఇక్కడ లభించింది. ఈ సందర్భంగా పివిఆర్ మాధవరావు ఇంటిలో ఆతిథ్యం స్వీకరించారు. వారికి పారిశ్రామికవేత్త జనార్ధన్‌రావు పవార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈ వార్డులో కార్యక్రమాలను యువ నాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్, శంకరలు పర్యవేక్షించారు. .

**అడుగులేసిన ఎంఎల్ఏ:**

18వ వార్డులో ఓ వైపు పివిఆర్ కుటుంబానికి చెందిన జనార్ధన్‌రావు పవార్,మరో వైపు యువనాయకుడు పఠాన్ ఫరీద్‌ఖాన్‌ల కలయికతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలతో ఎంఎల్ఏ ఎంతో సంతోషపడ్డారు. ఇక్కడ సంప్రదాయకళాకారులతో 'పులివేషాలు' ఏర్పాటు చేసారు.ఈ సందర్భంగా సంద్రాయకళల్లో ప్రవేశం ఉన్న శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డిని పులివేషాలువేసుకున్న వారు ఆహ్వానించగా ఆయన పులి అడుగులు వేసి జనాన్ని ఆహ్లాదపరచారు.ఈ కార్యక్రమాలను జనార్ధన్‌రావు పవార్, పఠాన్ ఫరీద్‌ఖాన్, నందిని హోటల్ శంకర్, జి.వి.రమణమూర్తి (స్వామి),మాజీ కౌన్సిలర్ మహబూబ్‌బాషా, అయ్యప్ప జనరల్ స్టోర్ రాజాశంకర్, చాంద్‌బాషా, రియాజ్‌బాషా, అల్తాఫ్, షబ్బీర్,అబ్బు, అనిల్, లక్కమనేని శేఖర్, జలకం గిరిలు ఏర్పాటు చేసారు. ఎంఎల్ఏతో పాటు దేవస్థానం ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ శెట్టిపల్లి సురేష్,పసల సుమతి, లోకేష్‌యాదవ్, పగడాల రాజు, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ముత్యాల పార్థసారధి, వడ్లతాంగళ్ బాలాజి ప్రసాద్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ సిరాజ్‌బాషాలు పాల్గొన్నారు.

## దీపావళి కి జీతం ఇస్తారా ...చెప్పలేం..!

**ఎదురు చూపుల్లోనే ఉపాధ్యాయులు**

కోట,నవంబరు 8 ప్రభాతవార్త : ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రతి నెలా ఒకటో తేదీన జీతం చేతికి అందుతుంది. ఇంటి అద్దె పాల డబ్బులివ్వడం,ఈఎంఐలు చెల్లింపులు నిత్యావసర సరకులు తెచ్చుకోవడం ..ఇలా ఉన్నంతలో అన్ని అవసరాలు తీర్చుకునేలా ప్రణాళిక ఉంటుంది.ఇదంతా ఒకప్పుడు .. వైకాపా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ఏడాదిగా ఆపరిస్థితి మారింది. జీతం ఎపుడు జమవుతుందో తెలియడంలేదు.. ఒకటో తేదీన పొందడం అనేది వేతన జీవులకు పగటి కలగా మారింది. గత ఎనిమిది రోజులగా చరవాణిలో ఏ సంక్షి సందేశం వచ్చినా జీతం జమకు సంబంధించిచేదేమోనని చూసుకోవడం .. కాకుండటంతో ..సహచరులకు ఫోన్ చేసి జమ అయిందో లేదో తెలుసుకోవడం పరిపాటిగా మారింది. ఏడో తేది గడిచినా జిల్లా వ్యాప్తంగా ప్రతి నెలా ఇదో సమస్య గా మారిందిని సదరు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో సమారు 40 వేల మంది ఉద్యోగులున్నారు. వీరిలో గరిష్టంగా ఏడు వేల మంది ఉపాధ్యాయులు, ఆతర్వాత రెవిన్యూ పంచాయతీరాజ్ .పోలీసు,వైద్య వ్యవసాయ, వివిద శాఖల ఇంజినీర్లు ఎక్కువ మంది ఉద్యోగులున్నారు. ఏడాదికిపైగా ఉద్యోగులు జీతాల చెల్లింపులో రోజుల తరబడి జాప్యం చోటుచేసుకుటోంది.రాష్ట్ర, జిల్లా స్ధాయిలో ఉద్యోగులుతో పాటు ఇతర ఆర్ధిక లావాదేవీలు నడిపేది ఖజానాశాఖ కావడంతో ప్రాధాన్యతా క్రమంలో తోలుత ఆశాఖతొపాటు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు,పోలీసులు, రెవిన్యూ శాఖకు క్రమ తప్పకుండా జమ అవుతున్నాయి. ఆ తర్వాత నిధులు లభ్యతను చూసుకుని మిగతా వారికి జమ చేస్తున్నారు. అక్టోబరు నెలకు సంబంధించి ఇప్పటికే అన్ని శాఖల ఉద్యోగులకు వేతనాలు జమ అయ్యాయి. ఉపాధ్యాయులకు మాత్రం ఎదురుచూస్తున్నారు.

## విస్తృతంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యక్రమాలు

**- సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణాకర్**



చిత్తూరు, నవంబర్ 8 ప్రభాతవార్త: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పలు కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి అమలు చేస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఐ.కరుణకుమార్ అన్నారు. జిల్లా కోర్టు న్యాయ సేవాసదన్‌లో బుధవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఐ.కరుణాకర్ జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహణపై విలేకరులతో మాట్లా డారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది నవంబర్ 9న జాతీయ న్యాయ సేవా దినోత్సవం నిర్వహించుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. నాలుగుగోడల మధ్య నిర్వహిస్తున్న న్యాయ సేవల విశిష్టతను, రాజ్యాంగ ఫలాలు, ప్రజలందరికీ అందించాల్సిన బాధ్యత న్యా వ్యవస్థద న్నారు. న్యాయ సేవలు అంటే ఏమిటి! న్యాయ సేవలు ఎలా పొందాలి! వీటిపై సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ, హైకోర్టు ఆధ్వర్యంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో 13 మండల న్యాయ సేవా అధికార సంస్థల ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నదన్నారు. రాజీ ప్రయత్నం ద్వారా ఎదైతే చేయగలమో అలాంటి కేసులను సుప్రీంకోర్టు ఇచ్చిన సూచనల మేరకు జాతీయ లోక్ అదాలత్, లోక్ అదాలత్, ప్రత్యేక లోక్ అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కరించడం జరుగుతుందన్నారు. చిత్తూరు జిల్లాలో 2023 జనవరి నుండి అక్టోబర్ 2023 వరకు జులై 22, అక్టోబర్ 21న నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా ఎంవిటిపి 21 కేసులకు సంబంధించి 1.93 కోట్ల రూపాయలు, 19 కేసుల ద్వారా 93 లక్షల రూపాయల వివాదాలను పరిష్కరించడం జరిగిందన్నారు. జిల్లా వ్యాప్తంగా 350 మంది సేవా లీగలల్ వాలంటీర్లు పని చేస్తున్నారని తెలిపారు. జిల్లాలో మీడియేటర్ కేంద్రాల ద్వారా 35 కేసులు పరిష్కరించడం జరిగిందన్నారు. అలాగే స్త్రీ సాధికారత పెంపొందించడానికి జిల్లాలో 52 అవగాహన సదస్సులు నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసుల గురించి ప్రజలు తెలుసుకోవాలని, ఎమైనా సమస్య వుంటే కోర్టుకు వెళ్ళకముందే మీ సమీపంలో వున్న లీగల్ కమిటీకి చిన్న పేపర్‌పైన మీ సమస్యలను తెలియజేస్తే ఆ సమస్యకు సంబంధించి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని గుడిపాల మండలం రాయలచేను ఎస్టీ గ్రామంను వివాదాలు లేని గ్రామంగా గుర్తించడం జరిగిందన్నారు.

## జగన్మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందంజ

**రాష్ట్ర కమిటీ ఛైర్మన్ నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి**



వెంకటగిరి, నవంబర్ 8 ప్రభాతవార్త : సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుందని రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డు ఛైర్మన్, వైసిపి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రాం కుమార్‌రెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రం వృద్ధి రేటులో గతంలో 17 స్థానంలో ఉండగా ఇప్పుడు మూడో స్థానానికి వచ్చిందని తెలిపారు. సిఎం జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రాన్ని ఏ విధంగా అభివృద్ధి చేశారు. కేంద్ర సంస్థ సర్వే చేసి వివరాలు వెల్లడించినట్లు తెలిపారు. పరిశ్రమల స్థాపన కూడా రాష్ట్రం నెంబర్ వన్ స్థానంలో ఉన్నట్లు తెలిపారు. వైద్య కళాశాలలను రాష్ట్రానికి కొత్తగా నాలుగు తెప్పించినట్లు చెప్పారు. జగనన్న గృహాలు, సంక్షేమ పథకాలు, పరిశ్రమల స్థాపన వంటి అన్ని రంగాలు దేశంలోనే ముందంజలో ఉన్నాయన్నారు. రాష్ట్రానికి జగనన్న అనంతరం అనే కార్యక్రమం పై తొమ్మిదో తేది నుండి విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. తాను సమన్వయకర్తగా బాధ్యతలు తీసుకుని 10 నెలలు అయిందని ప్రతి కార్యకర్త, నాయకుడికి సముచిత స్థానం కల్పిస్తున్న ట్లు తెలిపారు. చిన్నపాటి కార్యకర్తను కూడా తాను దూరం చేసుకోనని తెలిపారు. జగనన్న లేఔట్‌లో జరిగిన అవినీతికి సాక్షాదారాలతో సహ బయటపెట్టినట్లు చెప్పారు. సైదాపురం మండలంలో మైనింగ్ మాఫియా పై తాను ఉక్కు పాదం మోపినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి అక్కడ ఏం చేశారని విమర్శించారు. ఎమ్మెల్యే ఆనం రాంనారాయణరెడ్డి మూడు సంవత్సరాలు మైనింగ్ మాఫియాను ఎందుకు అడ్డుకోలేదని తెలిపారు. కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి పార్టీ వ్యతిరేక కార్యకలాపాలలో పాల్పడినందుకు అధిష్టానం సస్పెండ్ చేసిందని తెలిపారు. త్వరలో ఈ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయి అన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసులురెడ్డి, సురేష్‌రెడ్డి, బాబీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో బ్రహ్మోత్సవాలు

**శ్రీచెంగాళమ్మ దేవస్థానం ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి**



సూళ్లూరుపేట, నవంబర్ 8 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో ఇటీవల నిర్వహించిన బ్రహ్మోత్సవాలు విజయవంతంగా జరిగాయని శ్రీచెంగాళమ్మ దేవస్థానం ఛైర్మెన్, దువ్వూరు బాలచంద్రారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విలేకర్లుతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలను విజయంతం చేసిన దాతలకు, పట్టణ ప్రముఖలతో ఈ నెల 10న ధన్యవాదాల సమావేశాన్ని ఏర్పాట్లు చేస్తునట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాలను విజయవంతంగా చేసి అందరి ప్రశంసలు పొందామన్నారు. అదే విధంగా బ్రహోత్సవాల నిర్వహించేందుకు విరాళలు అందచేసిన భక్తులకు, పట్టణ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఇందులో భాగంగా చెంగాళమ్మ ఆలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించి ధన్యవాదాలతో పాటు తిరునాళ్లకు వచ్చిన విరాళాలు, వాటి ఖర్చు పద్దు లెక్కలు అందరికి తెలియపరుస్తామన్నారు. 10న జరిగే సమావేశానికి పట్టణ ప్రముఖలు, దాతలు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

## తిరుపతి జూకు నీటి ఏనుగులు, చిత్తడిజింకలు

**-సందర్శకులకు మరింత ఉల్లాసం**



తిరుపతి,నవంబర్ 8ప్రభాతవార్త: తిరుపతిలోని ఎస్వీ జంతుప్రదర్శనశాలకు రెండురకాల నూతన జంతువులను జూ అధికారులు తీసుకువచ్చారు. సెంట్రల్ జూ అథారిటీ అనుమతితో రాష్ట్రమంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచనలతో కేరళరాష్ట్రం తిరువనంతపురం జూ నుండి తిరుపతి జూకు రెండు నీటి ఏనుగులు, మూడు చిత్తడి జింకలు(స్వాంప్డీర్స్)వచ్చాయి. వీటిని రెండు వారాల పాటు క్వారంటైన్‌లో ఉంచి అనంతరం సందర్శకులకు వీక్షించేలా ఏర్పాట్లు చేస్తారు. ఇప్పుడు జూలో 89 జంతు జాతులు ఉన్నాయి. త్వరలోనే జిరాఫీ, జీబ్రాలను ఇతర జూల నుండి తిరుపతికి తీసుకురావడానికి, సందర్శకుల ఆహ్లాదం కోసం అవసరమైనన్ని ఏర్పాట్లుచేస్తున్నట్లు జూ క్యూరేటర్ తెలిపారు.

## హుండీ లెక్కింపు ద్వారా రూ. 80.65లక్షలు ఆదాయం



బోయకొండ(చౌడేపల్లి), నవంబర్ 8 ప్రభాతవార్త : శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మకు హుండీ లెక్కింపు ద్వారా రూ. 80,65,652లు ఆదాయంగా సమకూరినట్లు ఆలయ ఛేర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళిలు తెలిపారు. ఆలయంలో 56 రోజులకుగాను నిర్వహించిన లెక్కింపులో నగదుతో పాటు 85గ్రాముల బంగారం, 830గ్రాముల వెండిని అమ్మవారికి భక్తులు కానుకలుగా సమర్పించారన్నారు. అంతే కాకుండా విదేశీ కరెన్సీని కొంతమేర వచ్చిందన్నారు. అదే విధంగా రణభేరీ గంగమ్మ హుండీ ద్వారా రూ. 62,120లు సమకూరిందన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యం లో వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి సూచనల మేరకు అమ్మవారి ఆలయం దినదినాభివృద్ది చెందుతోందనీ, అదే స్థాయిలో ఆదాయం సమకూరుతోందని ఛేర్మన్ నాగరాజరెడ్డి అన్నారు. ధర్మకర్తల మండలి సభ్యులు రజని, రాందాస్, భారతి, పవన్‌రాయల్, రాజేష్, బుద్దమ్మ, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీదేవమ్మ, హైమావతి, రెడ్డెమ్మ, ఎండోమెంట్ ఇన్స్‌స్పెక్టర్ రవికుమార్‌రెడ్డి, ఆలయ అధికార, అర్చక, సిబ్బంది పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిచే ఎమ్మెల్సీ భరత్ ప్రచార రథం ప్రారంభం



రామకుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్సీ భరత్ యొక్క ఎన్నికల ప్రచార రథాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో కుప్పంలో ఎమ్మెల్యేగా భరత్‌ను గెలిపించేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాల న్నారు. వైకాపా ప్రభుత్వ పాలనలో ప్రజలు కలిగిన మేలు వారికి వివరించి సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి మరోమారు మద్ద తు పలికేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు, పరిశీలకుడు రెడ్డెప్ప, జానపద కళల కార్పోరేషన్ ఛైర్మన్ కొండవీటి నాగభూషణం, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ బాబురెడ్డి, కో కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్ మురళీకృష్ణ, నేతలు కేశవరెడ్డి, చెంగారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, జబీ,కుప్పం జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, టెలికాం బోర్డు సభ్యుడు వెంకటేష్ పాల్గొన్నారు.

## ఆసియా ఖండంలోని ఎస్వీకి ర్యాంక్‌ల పంట

**ఉపకులపతి కె.రాజారెడ్డి వెల్లడి**

తిరుపతి క్రీడ, నవంబర్ 8 ప్రభాతవార్త : ఆసియా ఖండంలోని ఎస్వీ యూనివర్శిటికి 2023..24 సంవత్సరానికిగాను ర్యాంకుల పంట మోగిందని ఎస్వీ ఉపకులపతి కె.రాజారెడ్డి వెల్లడించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ శ్రీవెంకటేశ్వరవిశ్వవిద్యాలయంకు 451..500 ర్యాంక్ క్యూఎస్, ఏషియన్ యూనివర్శిటిర్యాకింగ్‌లో 125 ర్యాంక్ సాధించడం పట్ల తానుకేంతో సంతోషంగా ఉందన్నారు. పనితీరు సూచికులు, టిచింగ్, పరిశోధన వాతావరణం, పరిశోధన నాణ్యత పరిశోధన నైపుణ్యం అంతర్జాతీయ దృక్పదం వంటి రంగాలల్లో అభివృద్ధిని పరిగణించి ఈ ర్యాకింగ్‌ను ప్రకటించారని పేర్కొన్నారు. రిజిస్ట్రార్, అధ్యాపకులు ఈ సందర్భంగా ఉపకులపతిని రాజారెడ్డిని అభినిందించారు.

## ప్రజల సమస్యలు పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం

**వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి**



రామచంద్రాపురం, నవంబర్ 8 ప్రభాతవార్త: ప్రజల సమస్యలు పరిష్కారానికే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం కోదండ రామాపురం, రామచంద్రాపురం ఎస్టీ కాలనీలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రతి ఇంటికీ అందించారు. అనంతరం ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోనే మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో మన ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ప్రతినిధులు, అధికారులను ఇంటి వద్దకే పంపి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. వచ్చే సాధారణ ఎన్నికలలో అన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్ధించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, నాయకులు యశ్వంత్ రెడ్డి, వేణునాధం రెడ్డి, మురళి, పుష్పకాంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## శ్యామ్‌లాల్ కుమార్తె మృతికి రోజా నివాళి



నిండ్ర,నవంబరు 8 ప్రభాతవార్త : రాష్ట్ర వైకాపా యువజన కార్యదర్శి శ్యామ్‌లాల్,తెలుగు అకాడమి డైరెక్టర్ జయశ్రీ కుమార్తె రెన్సీ నక్షత్ర మృతదేహానికి బుదవారం రాష్ట్ర పర్యాటకశాఖా మంత్రివర్యులు ఆర్‌కె రోజా పూలమాలవేసి నివాళులు అర్పించినారు.గత కొంత కాలంగా రెన్సీ నక్షత్ర ఆరోగ్యం సరిలేక ఆసుపత్రి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినారు.ఈసందర్భంగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతి తెలియజేసారు. కార్యక్రమంలో వైకాపా సినియర్ నాయకులు రామ్‌ప్రసాద్‌రెడ్డి, యంపిపి దీపాజలంధర్‌రాజు,సింగల్‌విండో చేర్మన్ మునిక్రిష్ణారెడ్డి,వైకాపా మండల కన్వీనర్ వేణురాజు, సచివాలయ కన్వీనర్ బాబురెడ్డి,సర్పంచ్ వసంతమ్మ,నాయకులు నాగభూషణంరాజు, సుబ్రమణ్యం యాదవ్, శివలింగం ఆచ్చారి, మేరీజయరామ్, రామచంద్రారెడ్డి, సత్యరాజ్, సుబ్రమణ్యం రాజు, అనిల్,మహేష్,విజేష్,దామోధరం తదితరులు పాల్గోన్నారు.

## కార్తీకమాసం ఆలయ దర్శన వేళల్లో మార్పు

శ్రీకాళహస్తి,నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసం సందర్బంగా దర్శన వేళల్లో మార్పు చేయటానికి స్థానిక స్థలపతి డాక్టర్ ఎస్ఎంకె స్వామినాధన్ ఇచ్చిన సూచన మేరకు దేవాదాయశాఖ ఈ నెల 11 నుంచి డిసెంబర్ 12వరకు ఆలయ దర్శన వేళల్లో మార్పులు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వటం జరిగింది. ఈ మేరకు బుధవారం ఆలయ ఇఓ కెవి సాగర్‌బాబు సిబ్బందికి ఉత్తర్వులు జారి చేస్తూ సోమవారాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగింది. ఈ నెల 13 నుంచి శ్రీకాళహస్తీశ్వరుని ఆలయంలో దర్శన వేళలు, పూజలకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కార్తీకమాసం సమయ పాలన ఆచరిస్తూ భక్తులకు సదుపాయాలుకల్పించాలని ఆదేశించారు. ఉదయం 4గంటలకు ఆలయం తెరచుట,మంగళవాయిద్యాలు 4.15గంటలకు గోపూజ, తిరుమంజనం,ఉదయం 4.30గంటలకు సుప్రభాత సేవ, ఉదయం 5 గంటల నుంచి సర్వదర్శనం, ఉదయం 5గంటలకు మొదటి కాలాభిషేకం, ఉదయం 6గంటలకు రెండవ కాలాభిషేకం, ఉదయం 10గంటలకు మూడవ కాలాభిషేకం, సాయంత్రం 3.30గంటలకు ప్రదోష కాలాభిషేకం,మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రభిషేకం, రాత్రి 9గంటలకు ఏకాంత సేవను నిర్వహించుటకు ఇఓ కెవి సాగర్‌బాబు ఆదేశించారు.

## తమిళనాడులో మంత్రి పెద్దిరెడ్డికి బ్రహ్మరథం

**- వివాహంకు హాజరైన మంత్రి.. ఘనంగా సత్కరించిన మైనార్టీలు !!**



కుప్పం, నవంబర్ 8 ప్రభాతవార్త : కుప్పం సరిహద్దు తమిళనాడు రాష్ట్రం వేపనపల్లిలో రాష్ట్ర అటవీ,గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గుడుపల్లె మండలం ఓఎన్ కొత్తూరుకు చెందిన సర్పంచ్ దేవప్ప నాయుడు కుటుంబీకుల వివాహం నిమిత్తం మంత్రి వేపనపల్లిలోని సంగం మహల్‌కు చేరుకుని నూతన వధూవరులను ఆశీర ్వదించారు. అంతకుముందు వేపనపల్లిలో మైనార్టీ నేతలు మంత్రి పెద్దిరెడ్డికి భారీ గజమాలతో సత్కరించి పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఎన్నడూలేని విధంగా మంత్రికి తమిళనాట జనం నీరాజనాలు పలికారు. ఈసందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ వేపనపల్లిలో మైనార్టీలు పెద్ద ఎత్తున ఘనస్వాగతం పలికి సత్కరించడం పట్ల వారిని అభినందించారు. అంతకుముందు మంత్రి పెద్దిరెడ్డికి కుప్పంలో ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్, రెస్కోఛైర్మన్ జీఎస్ సెంధిల్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, ఎఎంసి ఛైర్మన్ విద్యాసాగర్, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, ఎపిఐడిసి డైరెక్టర్ నందకుమార్, వివిధ హోదాల్లో ఉన్న నేతలు, మున్సిపల్ కౌన్సిలర్లు ఘనస్వాగతం పలికారు. ఈసందర్భంగా కుప్పంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

## వినియోగదారుల సేవల్లో అలసత్వం వద్దు

**-రైతులకు అడిగిన వెంటనే విద్యుత్తు సర్వీసులు -సమీక్షా సమావేశంలో సిఎండి కె. సంతోష రావు**

తిరుపతి రవాణా, నవంబర్ 8 ప్రభాతవార్త : విద్యుత్ వినియోగదారులకు అందించే సేవల్లో అలసత్వం వద్దని ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు అధికారులకు సూచించారు. తిరుపతిలోని ఎంపిఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం సంస్థ అధికారులతో సిఎండి కె సంతోష రావు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలను అందించాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలన్నారు. నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. విద్యుత్తు అంతరాయాలపై నిరంతరం సమీక్షిస్తూ, వాటిని పూర్తి స్థాయిలో నిరోధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వినియోగదారులకు మెరుగైన, సత్వర సేవలందించేందుకు వీలుగా వాట్సాస్, చాట్ బోట్, జగనన్న రైతు నేస్తం సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. తద్వారా వినియోగదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు అవకాశం వుంటుందని తెలియజేసారు. ఇక రైతులు వ్యవసాయ కనెక్షన్లను పొందేందుకు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. జగనన్న రైతునేస్తం సేవల ద్వారా నిర్ణీత సమయంలో దరఖాస్తులను పరిశీలించి, వెంటనే సర్వీసులను విడుదల చేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు విద్యుత్ అంతరాయలు, సమస్యలపై ట్రోల్ ఫ్రీ నెంబరు 1912 లేదా 1800425 155333కు కాల్ చేయడం, చాట్బోట్, 9133331912 నంబరుతో వాట్సాట్ చాట్ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవచ్చుని తెలిపారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వివిఎస్ బాబు, ఎన్‌విఎస్ సుబ్బరాజు, కె. శివప్రసాద్‌రెడ్డి, చీఫ్ జనరల్ మేనేజర్లు డివి చలపతి, పి. అయూబ్ ఖాన్, కె. గురవయ్య, కె. విజయకుమార్‌రెడ్డి, జె. రమణాదేవి, వై. లక్ష్మి నరసయ్య, కెఆర్ఎస్, ధర్మజ్ఞాని, జనరల్ మేనేజర్లు మురళి, రామచంద్ర రావు, సురేంద్ర రావు, శ్రీకాంత్, నాగరాజు, శ్రీనివాసులు, పద్మ, శోభా వాలెంటీనా, సూపరింటెండెంట్ ఇంజనీర్లు కృష్ణారెడ్డి, విజయన్, రమణ, సురేంద్ర, ఉమాపతిలతో పాటు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, అకౌంట్స్ విభాగపు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య ఆదాయం రూ.1.52కోట్లు



శ్రీకాళహస్తి, నవంబర్ 8 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం స్వామిఅమ్మవార్ల హుండీలతో పాటు పరివారదేవతల హుండీల లెక్కింపును ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఇఓ కెవి.సాగర్‌బాబుల ఆధ్వర్యంలో లెక్కింపు నిర్వహించారు. 28రోజులకు శివయ్య ఆదాయం రూ.1,52,00,823కోట్లు వచ్చినట్లు తెలిపారు. వీటితో పాటు బంగారు 000.080.000, వెండి 471.700కేజీలు, విదేశీనోట్లు 119 వచ్చినట్లు వివరించారు.